క్లుప్తంగా

పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన బిడ్డల జననం

నాదెండ్ల: గర్భవతులు పౌష్టికాహారం తీసుకున్నపుడే ఆరోగ్యవంతమైన బిడ్డలు జన్మిస్తారని స్టేట్ రిసోర్స్ పర్సన్ అర్జున్‌రావు చెప్పారు. నాదెండ్లలో గురువారం పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ నెల 8-22వ తేదీ వరకూ పక్షోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి, ఎంపీడీవో స్వరూపరాణి, ఈవోపీఆర్డీ లక్ష్మీ నిర్మలకుమారి, సూపర్‌వైజర్ నిర్మలాకృష్ణమాల, పంచాయతీ కార్యదర్శులు సుబ్బారావు, మారుతీరావు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పేదవర్గాలకు నాణ్యమైన విద్యనందించాలి

నాదెండ్ల: సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల చిన్నారులను దేశాభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలంటే వారికి నాణ్యమైన విద్యనందించాలని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు చెప్పారు. గణపవరం అంబేద్కర్ కాలనీలో గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రసన్నకుమార్, అనిల్‌కుమార్, విజయ్ ఉన్నారు.

ఆస్తి పన్ను వడ్డీపై 50 శాతం రాయితీ

నరసరావుపేట: పురపాలక సంఘ పరిధిలోని ఆస్తి, ఖాళీ స్థల పన్నుల బకాయిలు ఈ నెలాఖరులోపు ఏకమొత్తంగా చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు పొడిగిస్తూ గురువారం జీవో నం.66ని జారీ చేసిందని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు పేర్కొన్నారు. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నును ఏప్రిల్ 30 నాటికి ఏకమొత్తంగా చెల్లించిన వారికి ఆస్తి పన్నులో 5 శాతం రాయితీ లభిస్తుందన్నారు.

చిటుక వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

శావల్యాపురం: జీవాల్లో చిటుక వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి సోముల గుణధీర్ అన్నారు. గురువారం స్థానిక పశువైద్యశాల్లో వైద్యాధికారి మాట్లాడుతూ గొర్రెలు, మేకలలో చిటుక వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జీవాలకు టీకా చేస్తున్నట్లు తెలిపారు. తొలకరి వర్షాలు, అకాల వర్షాలు వల్ల లేత గడ్డిలో నీరు ఉన్న మేత తినటం ద్వారా జీవాల్లో చిటుక వ్యాధి వస్తుందన్నారు.

కనపర్రు మాజీ సర్పంచ్ నాతాని మృతి



నాదెండ్ల: కనపర్రు మాజీ సర్పంచ్ నాతాని సీతారామయ్య (75) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నరసరావుపేటలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 2014-19 కాలంలో ఆయన గ్రామ సర్పంచ్‌గా సేవలందించారు. ఆయనకు భార్య, ఇరువురు కుమార్తెలు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు గ్రామానికి చేరుకుని సీతారామయ్య మృతదేహానికి నివాళులు అర్పించారు. పలువురు మండల నాయకులు ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

సమస్యల పరిష్కారమై ఎన్‌ఎంయూ ధర్నా

వినుకొండ: నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఏపీఎస్ఆర్టీసీలో ఉన్న పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ అన్ని డిపోలలో ఈ నెల 11, 12 తేదీలలో గేట్ మీటింగ్, ధర్నా కార్యక్రమం నిర్వహణలో భాగంగా వినుకొండ డిపో ఎదుట డిపో కార్యదర్శి వి. శివప్రసాద్ నాయక్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ధర్నానుద్దేశించి డిపో అధ్యక్షులు బూదాల సౌభాగ్యరాజు మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర కమిటీ 13 సార్లు వినతి పత్రాలు ఇచ్చినా పై సమస్యలు పరిష్కారం కాలేదని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ముప్పాళ్ళ శ్రీను, కె. ఆదెయ్య, కాళీ, డి. శ్రీను, హరిహరబాబు, ఈపీకే రావు, కిరణ్, తులసి నాయక్, నాగేశ్వరరావు, కటారి, శ్రీను పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌చార్జి యల్లనూరి హనుమంత రావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేస్తూ అంతర్ పంటలు వేయడం ద్వారా రైతన్నలకు ఆదాయంతో పాటు భూమికి కావల్సిన సూక్ష్మ పోషకాలు వృద్ధి చెంది భూమి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు అంజలీదేవి, భూలక్ష్మి, సుబ్బరత్నం, ప్రవల్లిక, గ్రామరైతులు పాల్గొన్నారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

నూజెండ్ల: మండలంలోని ఉప్పలపాడు డా.బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో రానున్న విద్యాసంవత్సరం 5వతరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష 13న ఆదివారం జరుగనున్నట్లు ప్రిన్సిపాల్ రమణమ్మ గురువారం తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ 5 వతరగతి, మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకూ ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్ష ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటు ఆధార్ కార్డు తమ వెంట తెచ్చుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

కలెక్టర్ ఆదేశాలు లెక్కచేయరా?

- కత్తవ కాలువ, చెరువు ఆక్రమణలు తొలగించండి
- కలెక్టర్ ఆదేశాల అమలు కోసం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన ప్రజాసంఘాలు
- కార్యాలయంలో అర్జీ అందజేత



ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: పట్టణంలోని సత్తెనపల్లిరోడ్డులో ఆవుల సత్రం ప్రక్కన ఉన్న కత్తవ చెరువు డ్రెయినేజీ కాలువ, దాని మూడెకరాల చెరువు స్థలాన్ని ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించిన వారిపై చర్యలు తీసుకొని ఆక్రమణలు తొలగించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. దీనిపై కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ మున్సిపల్ కమిషనర్ పట్టించుకోకపోవడంతో గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయంలో అర్జీ అందజేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ కత్తవ చెరువు, కాలువ ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోకపోవడం వలన భూ కబ్జాదారులు ఈ స్థలం మాది అన్నట్లుగా విర్రవీగుతూ బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారిని వివరణ అడగ్గా ఆక్రమణలు తొలగించాలని మాకెటువంటి ప్రభుత్వ ఆదేశాలు లేవని వివరణ ఇచ్చారన్నారు. ఈ సమాధానం చెప్పిన టౌన్ ప్లానింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని న్యాయవ్యవస్థ దృష్టికి కూడా తీసుకెళ్లబోతున్నామని అన్నారు. పట్టణ ప్రజలు రాబోయే రోజుల్లో వరద ముంపునకు గురయ్యే పరిస్థితి ఉందని, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని, భూ కబ్జాదారులు నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను తొలగించి కత్వా చెరువు భూమి, డ్రెయినేజీ కాలువపై నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను తొలగించాలని కోరారు. పీడీఎం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వి.కోటనాయక్, బీసీ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెంచిన ధరలు వెంటనే తగ్గించాలి

- ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నేతలు విస్మరించారు
- ఆర్డీవో కార్యాలయం ఎదుట ఎంసీపీఐయూ ధర్నా



ధర్నా చేస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్‌పై రూ.50లు, పెట్రోల్, డీజిల్‌పై పెంచిన రెండు రూపాయల ఛార్జీలను వెంటనే తగ్గించాలని పల్నాడు జిల్లా భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) (ఎంసీపీఐయూ) కార్యదర్శి రెడ్‌బాష డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ ఆఫీసు ఎదురుగా ఉన్న గాంధీ బొమ్మ సెంటర్ నుంచి స్టేషన్‌రోడ్డులోని గాంధీ పార్కువరకు ప్రదర్శనగా వెళ్లి అక్కడ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు వచ్చి పెంచిన ధరలకు వ్యతిరేకంగా కార్యాలయం ముందు ధర్నా చేశారు. రెడ్‌బాష మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ప్రజలకు మేము అధికారంలోకి వస్తే గ్యాస్ ధరలు పెంచమని, నిత్యవసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని వాగ్దానం చేశారన్నారు. ఈ మేరకు ఆర్డీవో మధులతకు వినతిపత్రం అందజేశారు. మండల కార్యదర్శి సాప మస్తాన్‌వలి, పట్టణ కార్యదర్శి షేక్ షరీఫ్, కార్మిక సంఘం ఏఐసీటీయూ నాయకులు షేక్ అలీమ్‌ఖాన్, యువజన సంఘం నాయకులు షేక్ మహబూబ్‌బాషా, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ సైదాసాహెబ్, ఏఐఎఫ్‌డీడబ్ల్యు మహిళా సంఘం జిల్లా కార్యదర్శి షేక్ రేష్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ లావు తీరు పాలుతాగి రొమ్ముగుద్దిన చందమే

లావుపై ఆగ్రహం వ్యక్తంచేసిన వైఎస్సార్ సీపీ రైతు విభాగ జిల్లా అధ్యక్షులు

నరసరావుపేట: పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు వ్యవహారం చూస్తుంటే తల్లి పాలు తాగి రొమ్ము గుద్దిన చందంగా ఉందని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా రైతు విభాగ అధ్యక్షులు అన్నెంపున్నారెడ్డి పేర్కొన్నారు. ఎంపీ లావుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పున్నారెడ్డి గురువారం పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేశారు. తమ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎంపీ విమర్శలు చేయటం చాలా విడ్డూరంగా ఉన్నాయన్నారు. మాజీ సీఎం జగన్ వ్యక్తిత్వం గురించి గతంలో తెలియదా మీకు అని ప్రశ్నించారు. ఐదేళ్లు తమ పార్టీ తరఫున ఎంపీగా పనిచేసి, తమ పార్టీ దయతో గెలిచి అధికారం అనుభవించి ఇప్పుడు ఆయనపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కుల రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. మిర్చి రైతులు గిట్టుబాటు ధర లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, వాటి గురించి ఒక్కసారైనా పార్లమెంట్‌లో ప్రస్తావించలేదని, ఆ విషయం గురించి ఆలోచించాలని సూచించారు.

బార్ నూతన అధ్యక్షుడిగా జీవీహెచ్‌ఎస్ ప్రసాద్



బార్ అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులతో న్యాయవాదులు

చిలకలూరిపేటటౌన్: న్యాయవాదులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని న్యాయవాది జీవీహెచ్‌ఎస్ ప్రసాద్ తెలిపారు. చిలకలూరిపేట బార్ అసోసియేషన్ 2025-26 సంవత్సరానికి నూతన కమిటీ ఎన్నికలు పట్టణంలో నిర్వహించారు. స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికోర్టు(జూనియర్ డివిజన్)లోని బార్ అసోసియేషన్ హాలులో జరిగిన ఎన్నికలకు పరిశీలన అధికారులుగా దాసరి చిట్టిబాబు, పుల్లగూర శామ్యూల్‌జాన్, మాదాసు భానుప్రసాద్ వ్యవహరించారు. నామినేషన్ స్వీకరణ ప్రక్రియలో అధ్యక్ష పదవి జీవీహెచ్‌ఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా యల్లమందల శ్రీనివాసరావు, కార్యదర్శి పమిడి రాజ్‌కుమార్, సహాయ కార్యదర్శి సైదావలి షేక్, కోశాధికారి జి శివరామకృష్ణ నామినేషన్లు వేశారు. దీంతో ప్రతి పదవికి ఒక్కొక్కటి మాత్రమే రావడంతో నామినేషన్లను పరిశీలించిన అధికారులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించడం జరిగింది. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులకు జూనియర్, సీనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు పెరగాలి



చికిత్స పొందుతున్న రోగితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవి

శావల్యాపురం: ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల గణనీయంగా పెరగడానికి వైద్య ఆరోగ్య సిబ్బంది తమ వంతు బాధ్యత వహించాలని డీఎంహెచ్‌వో రవి అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్యసేవలు ఆరా తీశారు. వేసవికాలం ప్రారంభం కావటంతో వడదెబ్బ తగిలే అవకాశాలు ఉన్నందున మందుల అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు అర్హత కల్గియున్న వారందరికీ అందించాలన్నారు. అనంతరం వైద్యశాల పరిసరాలు పరిశీలించారు. ఆయనతో పాటు వైద్యాధికారి రావిపూడి రమ్య, సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సు ధనలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ సతీష్, ఫార్మాసిస్ట్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

సేవే లక్ష్యంగా వైద్యసిబ్బంది పనిచేయాలి



సభ్యులతో ఎంపీ లావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేటటౌన్: ఏరియా ప్రభుత్వ వైద్యశాలలోని వైద్యులు, సిబ్బంది సేవే లక్ష్యంగా విధులు నిర్వహించాలని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబులు కోరారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) నూతన ప్రమాణస్వీకారం గురువారం ఏరియా వైద్యశాల్లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని వారు మాట్లాడారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన హెచ్‌డీఎస్ చైర్మన్ డాక్టర్ రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, సభ్యులు డాక్టర్ కంకణపాటి భారతి, మల్లికార్జునరావు, సుబ్బమ్మ, ప్రసాద్‌లను అభినందించారు. వైద్యశాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బీవీరంగారావు, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.సురేష్ కుమార్, ఆర్ ఎం ఓ లు డాక్టర్ ఏడుకొండలు, కె.దయానిధి, డాక్టర్ మంత్రుల నాయక్, డాక్టర్ ప్రసూన, డాక్టర్ అలేఖ్య, డాక్టర్ కౌముది, డాక్టర్ రామేశ్వరి, డాక్టర్ నజియా, డాక్టర్ హేమ శ్రీ పాల్గొన్నారు.

ఘనంగా శిలువ పాదయాత్ర

నాదెండ్ల: మండలంలోని కనపర్రు గ్రామంలో తపస్కాలం సందర్భంగా గురువారం మరియ యేసోబు దేవాలయం నుంచి బాలయేసు పుణ్యక్షేత్రం వరకూ శిలువ పాదయాత్ర నిర్వహించారు. యేసుప్రభువు 40 రోజులు ఉపవాస దీక్షలు ఉన్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని విచారణ పరిధిలోని కనపర్రు, సాతులూరు, మల్లాయపాలెం గ్రామాలక చెందిన భక్తులు ఒకరోజు ఉపవాస దీక్ష అనంతరం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ శిలువ పాదయాత్ర నిర్వహించారు. విచారణ గురువు పగడాల చిన్నప్ప శిలువ లాగి తపస్కాలం సూత్రాల గురించి వివరించారు. అనంతరం కనపర్రు బాలయేసు చర్చిలో ప్రార్థనలు నిర్వహించి భక్తి గీతాలాపన చేశారు. అన్నదానం నిర్వహించారు.

సాగర్ జలాలు నిలుపుదల

శావల్యాపురం: నాగార్జునసాగర్ కుడి కాలువ పరిధిలో సాగర్ జలాలు పూర్తి స్థాయిలో నిలుపుదల చేసినట్లు ఎన్నెస్పీ డీఈ జరుగుల విజయలక్ష్మి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గ పరిధిలో కాల్వలు పూడికతీత ముళ్ళ కంచెలు, పిచ్చిచెట్లు తొలిగింపు పనులు చేసేందుకు గాను రూ. 2 కోట్లు 70 లక్షలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. గతంలో చేయాల్సిన పనులకు సంబంధించి తీర్మానం చేసిన వాటికి ఈనిధులు వెచ్చించుతారన్నారు. చివరిభూముల వరకు సాగు నీరు అందేలా ఈపనులు దోహదపడతాయన్నారు. ఇందులో భాగంగా సంతగుడిపాడు సబ్ డివిజన్ పరిధిలో అద్దంకి బ్రాంచ్ కెనాల్ కట్టలపై ఉన్నటువంటి పిచ్చిచెట్లు తొలగింపు పనులకు రూ. 66 లక్షలు నిధులు కేటాయించినట్లు తెలిపారు. అలాగే ప్రకాశం జిల్లా అద్దంకి కెనాల్‌కు రూ.27 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. నీటి సంఘలూ సభ్యులకు తీర్మానంపై ఈ పనులు జరుగుతాయన్నారు.

కోడింగ్‌లో విద్యార్థులకు ఉచిత శిక్షణ

వినుకొండ: ప్రస్తుత సమాజంలో బీటెక్ అయిపోయిన విద్యార్థులకు కోడింగ్ అనేది నేర్చుకోవడం చాలా అవసరం. విద్యార్థికి వచ్చే శాలరీ, కోడింగ్ నేర్పరి తనం మీదే ఆధారపడి ఉంటుంది. అభివృద్ధి చెందిన అమెరికా, చైనా వంటి దేశాలలో కోడింగ్ ఆవశ్యకతను ముందుగానే గుర్తెరిగి 8వ తరగతి నుండే విద్యావ్యవస్థలో ఇనుమడించారు. ఇప్పుడు మన వినుకొండలో పేద విద్యార్థులకు ఉచిత కోడింగ్ శిక్షణ తరగతులు నిర్వహించబడుచున్నవి అని ఇందూరి రామాంజి రెడ్డి, (ఐఐటీ బాంబే) ఓ ప్రకటనలో తెలియజేశారు. వితంరాజుపల్లి సమీపంలోని సాయిబాబా దేవస్థానం ప్రక్కన ఉన్నటువంటి తమ ఇనిస్టిట్యూట్ లో ఏప్రిల్ 13 నుంచి క్లాసులు ప్రారంభమవుతాయని అన్నారు. ఉదయం, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని శిక్షణ కోసం వచ్చే విద్యార్థిని విద్యార్థులు మొబైల్ ఫోన్ కానీ ల్యాప్ టాప్ లేదా ట్యాబ్ కచ్చితంగా తీసుకొని రావాలని, 8వ తరగతి నుండి బీటెక్ వరకు చదివిన విద్యార్థిని విద్యార్థులు అర్హులని తెలియజేశారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష వాయిదా

బొల్లాపల్లి: మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశానికి విద్యార్థులకు నిర్వహించే పరీక్ష వాయిదా వేయడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపాల్ వి. పద్మావతి గురువారం తెలిపారు. పాఠశాల విద్యా కమిషనర్ ఆదేశానుసారం పరీక్ష వాయిదా వేయినట్లు తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి మోడల్ స్కూల్లో ఆరో తరగతి జాయిన్ అయ్యే విద్యార్థులకు ప్రవేశపరీక్ష ఈ నెల 20న నిర్వహించాల్సి ఉంది. ఆ రోజు ఈస్టర్ పర్వదినం కావడంతో మరుసటి రోజు 21 ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశపరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్స్‌ను www. cre.ap.gov.in www.apmr.apcfrr.in వెబ్‌సైట్స్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

వైద్యశాలలో వైద్యాధికారి తనిఖీలు

రొంపిచర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాల్లోని రికార్డులను తనిఖీ చేశారు. వైద్యశాలల్లో సమయ పాలన పాటించాలన్నారు. ఓపీ రికార్డులను పరిశీలించారు. అలాగే వైద్యశాల్లో ఉన్న ఔషధాల నిల్వలను కూడా పరిశీలించి సమీక్షించారు. నేషనల్ హెల్త్ ప్రోగ్రాం పై డాక్టర్లు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పి.జగన్ నరసింహారెడ్డి, డాక్టర్ నిమ్మల సాయిబాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


ప్రారంభమైన శిఖర కలశ మహోత్సవాలు

రొంపిచర్ల: స్థానిక శ్రీ అంకమ్మతల్లి పోతురాజు స్వామి వార్ల శిఖర కలశ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వర పూజా, పుణ్యాహ వాచనం కార్యక్రమాలతో ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 2 గంటలకు గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మశ్రీ కారంచేటి వెంకట పిచ్చయ్య శాస్త్రి, కారంచేటి వెంకట ప్రసన్న అచ్యుత్ శర్మల ఆధ్వర్యంలో పలువురు రుత్వికులు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎన్‌సీసీ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత

నరసరావుపేట రూరల్: ఎన్‌సీసీ-సీ సర్టిఫికేట్ పరీక్ష ఫలితాలలో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల క్యాడెట్స్ నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మేడికొండ రాజేష్‌బాబు గురువారం తెలిపారు. గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ ఆధ్వర్యంలో సీ-సర్టిఫికేట్ ఫిబ్రవరిలో ఒంగోలులో నిర్వహించారు. ఈ పరీక్ష ఫలితాలను ఏపీ, తెలంగాణ ఉమ్మడి ఎన్‌సీసీ డైరక్టరేట్ బుధవారం విడుదల చేశారు. కళాశాల నుంచి 29 మంది క్యాడెట్స్ పరీక్షకు హాజరుకాగా 19 మంది ఏప్లస్ గ్రేడ్, 10 మందికి బి గ్రేడ్ సాధించినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ముప్పాళ్ళ వాసికి తీవ్ర గాయాలు



ఈపూరు(శావల్యాపురం): రోడ్డు ప్రమాదంలో యువకుడుకు తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఈపూరు మండలం ఎస్సై యం.ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాలు మేరకు మండలంలోని అరేపల్లి ముప్పాళ్ళ గ్రామానికి చెందిన ముప్పాళ్ల మరియబాబు పొగాకు కంపెనీలో సూపర్‌వైజరు విధులు నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో ఉద్యోగరీత్యా బైకుపై బయలుదేరాడు. ఈ క్రమంలో కారంపూడి నుంచి వస్తున్న టిప్పర్ లారీ అతి వేగంతో వస్తుండగా మార్గమధ్యంలో బొమ్మరాజుపల్లి గ్రామ సమీపంలో కురువ మలుపు వద్ద టిప్పర్ లారీ, బైకును అతి వేగంతో ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈప్రమాదంలో దవడ, చేతులు, కాలు శరీరంపై తీవ్ర గాయాలైనట్లు ఎస్సై తెలిపారు. క్షతగాత్రుడిని 108 అత్యవసర వాహనం ద్వారా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యసేవలు నరసరావుపేటకు తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మావోయిస్టు పార్టీతో కేంద్రం చర్చలు నిర్వహించాలి

విలేకర్ల సమావేశంలో కోరిన ప్రజాసంఘాల నాయకులు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు నిర్వహించాలని ప్రజా సంఘాలు నాయకులు కోరారు. గురువారం స్థానిక కోటప్పకొండ రోడ్‌లోని విజ్ఞాన మందిరంలో ప్లకార్డులు ప్రదర్శించి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడారు. గత నెల 28వ తేదీన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో తాము శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించారన్నారు. ఈ ప్రకటన పట్ల వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు హర్షం వ్యక్తం చేశారని చెప్పారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర హోంమంత్రి ఆయుధాలు వదిలి చర్చలకు రావాలని ప్రకటించారని, కేంద్ర హోంమంత్రి లొంగిపోవాలని ఛత్తీస్‌ఘడ్‌లో ప్రకటించారన్నారు. చర్చల ప్రతిపాదనపై ఎలాంటి కండిషన్ లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని పీస్ కమిటీ ప్రకటించిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో చర్చలు నిర్వహిస్తామని నేటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదని అన్నారు. భారత రాజ్యాంగం పరిధిలో ఎవరితోనైనా చర్చలు జరిపే అవకాశం ఉన్నా చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా మావోయిస్టు పార్టీతో చర్చలు నిర్వహించి శాంతియుతంగా సమస్య పరిష్కారం చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. ఆపరేషన్ కగారు పేరుతో మధ్య భారతంలో నిత్యం మారణకాండకు పాల్పడటం, దేశంలో ఉన్న సైనిక బలగాలను భారత ప్రజలపై ఉపయోగించడం సరైనచర్య కాదనారు. ఏ ఉద్యమాన్ని అయినా ఫలానా తేదీలోపు నిర్మూలిస్తామని ప్రకటించడం సాధ్యం కానిదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం, ప్రజాస్వామ్యం కాపాడాలని అనుకుంటే వెంటనే చర్చలు ప్రతిపాదన అంగీకరించి శాంతియుత వాతావరణం కల్పించి, ప్రభుత్వం వైపునుంచి ప్రకటన ఇవ్వాలని కోరారు. ఏబీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు బి.అంజమ్మ, పౌర హక్కుల సంఘ జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్న పాల్గొని ప్రసంగించారు. పీడీఎం రాష్ట్ర నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షులు మస్తాన్‌వలి, జిల్లా కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా రెడ్డినగర్ అభయాంజనేయ స్వామి తిరునాళ్ల



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: రెడ్డినగర్ అభయాంజనేయ స్వామి ఆలయ 23వ తిరునాళ్ల మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు జరిపారు. ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు పొంగించి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా రెడ్డినగర్ ప్రధాన సెంటర్‌లో భారీ విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. యువకులు మొక్కుబడి ప్రభలతో ఆలయానికి వచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పీఎం శ్రీ పాఠశాలల్లో నిర్మాణాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న సీమటా ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: ప్రైమ్ మినిస్టర్స్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకం క్రింద ఎంపికైన పాఠశాలల్లో నిర్మాణాలు, వసతులను మే నెల చివరి నాటికి పూర్తి చేసి 2025-26 విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తీసుకురావాలని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ (సీమట) అధికారులు తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం పల్నాడుజిల్లా పరిధిలో పీఎం శ్రీ పథకానికి ఎంపికైన 38 పాఠశాలల్లో చేపడుతున్న నిర్మాణ పనులపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సంస్థ అధికారులు బి.సురేష్‌కుమార్, పి.రమేష్ కుమార్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ పాల్గొని జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేసారు. ఆయా పాఠశాలల్లో చేపడుతున్న ప్రయోగశాలలు, ఆటస్థలాలు, ర్యాంపు, గ్రంథాలయాలు తదితర నిర్మాణ పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వరద సుబ్బారావు, డీఈ ప్రభాకరరావు, ఈఈ నాగజ్యోతి, అకౌంట్స్ ఆఫీసర్ పి.శ్యాంప్రసాదు, ఏఎంఓ డి.రేవతి, ఆయా పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు



రామాంజనేయ యుద్ధంలో సన్నివేశం



హరిశ్చంద్ర నాటకంలోని కాటి సన్నివేశం

గణపవరంలో ముగిసిన నవమి ఉత్సవాలు

నాదెండ్ల: శ్రీరామ నవమిని పురస్కరించుకుని గణపవరం శ్రీ కోదండ రామాలయంలో జరుగుతున్న నవమి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. బుధవారం ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం చింతామణి నాటక ప్రదర్శన, రామాంజనేయ యుద్ధం, శ్రీహరిశ్చంద్ర నాటకం భక్తులను ఆకట్టుకున్నాయి. చింతామణి నాటకంలో భవానీశంకరుడిగా ఎం మరియదాసు, చింతామణిగా ప్రభావతిల నడుమ ప్రేమ సన్నివేశం ఆకట్టుకుంది. రామాంజనేయ యుద్ధంతో శ్రీరాముడిగా ఎస్.నాగరాజు, ఆంజనేయుడిగా కె.కాశేశ్వరరావు చౌదరిల మధ్య యుద్ధసన్నివేశం ప్రేక్షకుల చప్పట్ల నడుమ హోరెత్తింది. హరిశ్చంద్ర నాటకంలో వారణాసి, కాటి సన్నివేశాల్లో హరిశ్చంద్రుడిగా దుర్గారావు, చంద్రమతిగా ప్రభావతి, నక్షత్రుకుడిగా జి వెంకటేశ్వర్లు, వీరబాహు కాళకేశకుడుగా పి సుబ్బారావు చౌదరి నటనతో ఆకట్టుకున్నారు. గణపవరం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కోలా కోటేశ్వరరావు, రమణమ్మ దంపతుల ఆర్థికచేయూతతో నాటకాలు జరిగాయి.

విద్యుత్ సబ్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



సూచనలు చేస్తున్న విజయ్ కుమార్

రొంపిచర్ల: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను జిల్లా విద్యుత్ పర్యవేక్షక ఇంజనీర్ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్ కుమార్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. తనిఖీలు అనంతరం విద్యుత్ రెవెన్యూ వసూళ్లు నూరు శాతం చేయాలన్నారు. ప్రతి నెలా రెండవ శనివారం లైన్ మెయింటెనెన్స్ చేయాలన్నారు. నూతన సర్వీస్‌లను వెంటనే మంజూరు చేయాలన్నారు. అదనపు లోడును క్రమబద్ధీకరణ అవకాశాన్ని జూన్ 30 వరకు పొడిగించినట్లు తెలిపారు. 50 శాతం రాయితీతో అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవచ్చు అన్నారు. అదనపు లోడు క్రమబద్ధీకరణపై వినియోగదారుల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట రూరల్ డీఈఈ డి. వెంకటేశ్వరరెడ్డి, రొంపిచర్ల ఏఈఈ కె. రాంబాబు తదితర విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.